# శత్రువు

సీతమ్మ : ఒరే వెంకడూ, ఏవే చిన్నమ్మా, ఒరే సూరీ, ఎక్కడ చచ్చార్రా అంతా, గ్లాసులు కడిగితెమ్మంటే ఏంచేస్తున్నారర్రా. ఈ పూల కుండిల్లో పువ్వులు పెట్టమన్నాను, ఏమర్రా ఏంచేస్తున్నారు? ఎవరికీ నోరు పెగలదేం? ఈ రేడియో ఎవరు పెట్టేరు? ఏమిటా సంగీతం చెవిలో జోరీగలాగ.... ఏమే చిన్నమ్మా గ్లాసులు కడిగితెచ్చావా? జాగ్రత్త వగల గొట్టేవంటే నీచేతులు విరగ్గొడతాను. వెళ్ళు, దిష్టిబొమ్మలా ఎందుకలా నిలుచున్నావ్? గ్లాసులెక్కడున్నాయని అడుగుతున్నావా? నావల్లకాట్లో. గ్లాసులెక్కడుంటాయే వెధవమొహం నువ్వూను. చూడు అలమారలో వుంటాయి. ఇదిగో ఇంటికి పదిమంది వస్తారుగదా ఆ చింపిరిజుత్తూ. నూనెమొహం దెయ్యంలా ఏమిటే అదీ. జుట్టుకు నూనె రాసుకుని తల దువ్వుకో. చీరమార్చుకో, మొహం కడుక్కుని బొట్టుపెట్టుకో. ఓహో. అవునుగదూ. నీకా దిక్కుమాలిన వైధవ్యమొకటీ. పోనీ నీకాబొట్టు లేకపోతే వొచ్చిన నష్టం ఏంలేదులేవే, వెళ్ళు. వేగం పనులుకానీ. ఆ వెంకడెక్కడ చచ్చాడో చూడు, పూలకుండీలలో పువ్వులు పెట్టమంటే వీధిలోనిలబడి కొటలో కబుర్లు చెబుతున్నాడేమిటి? అబ్బబ్బ! ఇలాంటి పనివాళ్ళను పెట్టుకుని విందేమిటి నా బొంద. ఆయనకేం మహరాజు ఇవాళ పదిమందికి విందని పురమాయించి కారెక్కి తుర్రని వెళ్ళిపోతారు. వీళ్ళందరితో నెవిక్కడచావాలి. ఛ! మాటిమాటికీ యీ విందులొకటీ నా ప్రాణలమీదికి. అర్ధరాత్రి వరకూ పనులు తెమలవు.

బ్రహ్మం : అబ్బాయి ఫ్యాక్టరీ డైరెక్టరయిన తరవాత హోదాకు తగినట్టు నడుచుకోవాలి మరి. ఈ నాగరిక యుగంలో హోదాలోవున్న వారికి విందులూ, వినోదాలు. క్లబ్బులు, బిలియర్డ్సూ. పుట్టినరోజు

బహుమతులు యివన్నీ నిత్యజీవితావసరాలయాయి. వీటిద్వారా కొన్ని పనులు సాధించవచ్చును. వీటిద్వారా అధికారులను అకట్టుకోవచ్చునని అబ్బాయి అశ: ఫ్యాక్టరీ కార్మికులు సమ్మె చేస్తామని బెదిరిస్తున్నారు. వాళ్ళు కోరేవన్నీ ఒప్పుకోమంటారు. ఒప్పేసుకొనేకొద్దీ వాళ్ళ కోరిక లెక్కువవుతాయని యజమానుల అభిప్రాయం. ఈ తగువులకు చాల వరకు ఆ మేనేజరు సత్యమే కారణం. వాడ్ని తీసేస్తే చాల గొడవలు తగ్గుతాయని నేను సలహాయిస్తే అబ్బాయి నామీద కస్సుమన్నాడు. ఆ సత్యంగాడు నిరుడు కార్మికుల బోనసుడబ్బులో సగం తినేసినట్టు అడిట్‌లో బయటపడింది. యజమానుల డబ్బు తినలేదుగాబట్టి పెద్ద మనిషిగా చెలామణీ అవుతున్నాడు.

సత్యం : వర్కర్లు బోనసు తగువు కోర్టుకెక్కించారు. ఫ్యాక్టరీ గోడ పగులిచ్చి ప్రమాదంగావుందని లేబరు కమీషనరుకు అర్జీపెట్టారు. వాడొచ్చి గోడ తిరిగి కట్టించమని ఆర్డరిచ్చిపోయాడు. వాడి సొమ్మేం పోయింది. పదివేల రూపాయలు ఖర్చు. పోనీ ఓవెయ్యిరూపాయలతో ఖర్చుపెట్టి చెక్కసున్నంతో మరమ్మత్తు చేయిద్దామంటే వాడొప్పుకోడు. పోనీ సిక్కావాలంటే ఓ నాలుగువేలు తీసుకో అంటే తాచుపాములా చర్రని లేస్తాడు. లంచాలుతీసుకోడట. ఇలాంటి దౌర్భాగ్యుణ్ని నేనెక్కడా చూడలేదు. నిజం చెప్పాలంటే లంచం పుచ్చుకోకపోవడం వాడి దౌర్భాగ్యంకాదు. మన దౌర్భాగ్యం. ఆ గోడకట్టిస్తే మనకు డబ్బు కర్చేగాని వాడికేమిటి లాభమో నాకర్థంగాదు. ప్రజానాయకుడు మూర్తి ఒక్కడే ఈ సమస్యను పరిష్కరించగలడు. ఆయన తలుచుకుంటే ఈ కమిషనర్ని బదిలీ చేయించగలడు. ఆయన్నే కదిపిచూడాలి. కాని ఆయనో చిత్రమైన వ్యక్తి. ఇప్పటికప్పుడే రెండుపార్టీలు మార్చేడు. ఒక లక్షరూపాయల ఆస్తిచేసుకున్నాడు. కాని ఉండుండి కార్మికుల

పక్షాన మాట్లాడుతాడు. ఏమైనా ఆ కమీషనర్‌కంటె నయమే. ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడైనా మెత్తబడుతూ వుంటాడు.

కాని ఈసారి కార్మికుల బోనసు తగువులో ఏమీ చెయ్యలేక పోయాడు. కార్మికులు తెగించివున్నారు. మూర్తి ఏమాత్రం మెత్తబడినా నాయకత్వం ఎగిరిపోతుందని భయపడుతున్నాడు.

కూలీల డిమాండ్ చిత్రంగావుంది. నేను మేనేజరుగా వుండ కూడదట. ఎవరు ఏ పదవిలో ఉండాలన్నది నిర్ణయించేది వీళ్ళా? అన్నిటికీ సమ్మెట. సమ్మె, నోటీసులేకుండా సమ్మె.

కార్మికుడు: నోటీసు లేకపోవడమేమిటి? అర్నెల్లు క్రితమే యిచ్చాంగా. ఆ మేనేజరు సత్యాన్ని పదవిలోంచి తొలగించకపోతే సమ్మెచేస్తామని చెప్పేము. చేస్తున్నాం. మా డిమాండ్ న్యాయం కాదంటారా? అయితే ఆ మేనేజరు సత్యం మా బోనసుడబ్బు తినే యడం న్యాయమేనా? వాడు మాసంఘం సెక్రటరీని కొట్టించడం న్యాయ మేనా? మాచేత పని చేయించుకుని ఓవర్‌టైమ్ డబ్బు ఎగేయడం న్యాయమేనా? మేము సమ్మెసాగిస్తే లాకౌట్ చేస్తామంటారు. చెయ్యండి చూద్దాం. కొత్తపనివాళ్ళని పెట్టి ఫ్యాక్టరీ నడుపుతామంటారు. మేము లేకుండా యీ ఫ్యాక్టరీ ఎలా నడుపుతారోచూస్తాం. కొత్తవాళ్ళురారు. రానీయం. ఆమేనేజర్ని వదులుకుంటారో, రెండువేలమంది కూలీలతో తగువు పెట్టుకుంటారో ఆలోచించండి. ఏదో ఒక నిర్ణయంచేసి సాయంత్రంలోగా చెప్పండి. ఓహో తుపాకీతీశారా? దౌర్జన్యానికి మేము బెదరిపోతామనుకున్నారా? మాతడాఖా మీకు తెలీదు. మీరుగాని, ఆ సత్యంగాడుగాని బతికి బాగుండాలంటే మమ్మల్ని బెదిరించడం మానే యండి. జాగ్రత్త! ఎక్కడి వాళ్ళనక్కడే కైమాపు చేసేస్తాం. కవద్దార్

జ్ఞాపకం పెట్టుకోండి. సాయంత్రంలోగా మీ నిర్ణయం చెప్పకపోతే మీ ప్రాణాలమీద ఆశ వదులుకోవచ్చును.

రాజారావు: లేబర్ కమీషనర్ ఫ్యాక్టరీ లాకౌట్ ఎత్తిగలనీ, ఫ్యాక్టరీ తెరవాలనీ ఆర్డరువేశాడు ఇప్పుడేంచేస్తావ్ సత్యం? కూలీలు పనిలోకిరారు. కొత్తవాళ్ళని రానివ్వరు. ఏ మాత్రం అజాగ్రత్తగావున్నా దౌర్జన్యం జరుగుతుంది. పోలీసులు, కాల్పులు కూలీలు ఫ్యాక్టరీకి నిప్పంటిస్తారు. అంతా ధ్వంసమవుతుంది. ఈ ఫ్యాక్టరీ అనేది లేకపోతే నువ్వెవరు? నేనెవ్వరు? నీకూనాకూ వున్న వ్యక్తిత్వమేమిటి! గౌరవ మేమిటి మనవ్యక్తిత్వాన్ని కూలీలు నాశనం చెయ్యగలరు. కూలీలను అదుపులోపెట్టి పని చేయించలేని వాడివి నువ్వేం మేనేజరవయ్యా? అసలీ గొడవంతా నువ్వేతెచ్చిపెట్టేవు. ఏమిటీ, రాజీనామా యిస్తున్నావా? అరే! వెళ్ళిపోయాడా సత్యం. వీడు నన్నీగొడవలో ఒంటరిగా వొదలిపెట్టి పోయాడా? వీడికి విశ్వాసంలేదు దౌర్భాగ్యుడు. పోతేపోనీ, ఈ వ్యవహారమేమిటో నేనే స్వయంగా చూస్తాను. ఒరే వీరన్నా, ఏదీ కారు రెడీ చెయ్యి. నా తుపాకీకూడా తియ్యి. ఫ్యాక్టరీ ఎలా నడవదో చూస్తాను.

డ్రైవర్ వీరన్న: ఒద్దుబాబూ, తుపాకీచూస్తే కూలీలు రెచ్చిపోతారు. రోజుకు రెండురూపాయలు సంపాదించేవారికి పౌరుషమేమిటంటారు మీరు. కాని వాళ్ళూ మనుషులేకదా. మనిషన్నవాడికి పౌరుషముండదా? రెండువేల మంది కూలీలందరికీ కలసి మీ ఒక్కరికున్నంత పౌరుషముండదా అంతేకాదు. వాళ్ళకున్న తెగింపు మీకుండదు బాబూ బతుకంటే మీకున్న భయం వాళ్ళకిలేదు. గౌరవం పోతుందనీ రాబడి. వుండదనీ, తమ జాగాలోకి యింకోకరొస్తారనీ రేపటి మాటేమిటనీ వాళ్ళకి భయంలేదు. ఆ భయాలన్నీ మీకేబాబూ, అందుకే, వాళ్ళడిగిం దేదో యిచ్చేసి చక్కా ఫ్యాక్టరీ నడుపుకోండి. ఎందుకొచ్చిన తగువు.

రాజారావు: రాస్కెల్ నువ్వుకూడా ఆ కూలీల మనిషివేనా? పో. నీపని నాకక్కరలేదు. వెళ్ళవా? సరే పో. నాకేం డ్రైవరు దొరక్కపోరు. పూటకి గతిలేని ప్రతివాడూ నాకు లెక్చరిచ్చేవాడేనా? నన్ను బెదిరించేవాడేనా? పైగా నన్ను చంపుతామని బెదిరిస్తారా? చంపడం అంత సులభమా? పోలీసులులేరా? ప్రభుత్వంలేదా? అదిగో పోలీసు ఇన్స్పెక్టరు, అయ్యా, రండి, కూలీలు నన్ను చంపుతారట, నాకు మీరక్షణకావాలి. నవ్వుతారేం. నేను అనవసరంగా భయపడుతున్నానంటారా? చంపుతామంటే భయంకాదా ఇన్స్పెక్టర్? ఇద్దరు జవాన్లని కావలాయిస్తారా; రెండువేలమంది కూలీల్ని యిద్దరు జవాన్లేంచేయగలరు? తలుపేసుకుని యింట్లో వుండమంటారా? అరె వెళ్ళిపోయాడా ఇన్స్పెక్టరు. నాకు రక్షణలేదు. అంతా నాకు వ్యతిరేకమయ్యారు. నేనొంటరిగాడినయాను. ఒంటరిగాడిని చంపడం తేలిక డ్రైవరు, నౌకరు అంతా నాకు వ్యతిరేకమయారు. వంటమనిషిని మాన్పించేయాలి. అన్నంలో ఏ విషమైనా కలిపేవచ్చును. ఈ లోకంలో. ప్రతిఒక్కడూ నాకు శత్రువయాడు. అదిగో కూలీల కేకలు. వచ్చారు. నన్ను చంపడానికే వచ్చారు. అయ్యా, ఇన్స్పెక్టర్‌గారూ. రండి, పోలీసుల్ని తీసుకు రండి. నన్ను చంపడానికొచ్చారు సార్. అదిగో ఏమిటాశబ్దం. ఉరుములా? గాలివానా? తుపాకీ పేలిందా? నన్ను భయపెట్టడానికా? ఏదీ నా తుపాకీ ఏదీ? ఓకే, ఐ. యామ్‌రెడీ, పేల్చండి నేనూ పేలుస్తాను. ఓహో, ఏమిటది? అద్దంలో నల్లగా కమ్ముకుంది. కారుమేఘమా? కాదు తుపాకీపొగ. హల్లో రాజారామ్, నీజుత్తు నెరసింది. గెడ్డం మాసింది. వాటే ఫాల్ మైడియర్ రాజారావ్. నువ్వు గొప్ప తెలివైనవాడివి. పెద్ద చదువు చదివావ్. గొప్పహోదా. గొప్పదర్జా, గొప్ప ఆర్జన, అయితే నీకు రక్షణలేదు. నీకెవ్వరూలేరు. ఒంటరిగాడివి. నువ్వేకాదు, ప్రతివాడూ ఒంటరిగాడే. ప్రతివాడూ రెండోవాడిని క్రిందికితోసి తాను పైకి

పోవాలనే ప్రయత్నంలోనేవుంది శతృత్వం. అందుకనే ఒంటరితనం. హల్లో మిస్టర్, నీకెవ్వరూ తోడులేరు. అబ్బ గాలివాన, అమ్మో, పిడుగు ఏమిటా శబ్దం? తుపాకీయా, బాంబులా? ఏమిటవి రాజారావ్. ఇక నువ్వే నాకు తోడు. వస్తున్నా వెళ్ళకు, నువ్వే నా మిత్రుడివి రాజారావ్.

బ్రహ్మం: అయ్యో, ఘోరం. తన ప్రతిబింబాన్ని పట్టుకోబోయి నిలువుటద్దం క్రిందపడి చచ్చిపోయాడు. బతికినన్నాళ్ళూ ఒంటరిగా బతికేడు. తనలో తనకి తప్ప రెండో మనిషిలో నమ్మకంలేదు. చివరికి తన ప్రతిబింబాన్ని మాత్రమే నమ్మేడు, ఈ పరిణామాన్ని ఎవరూ తప్పించలేరు.